క్లుప్తంగా

ఎస్‌ఎం ఫారూఖ్‌కు సన్మానం



ఎస్‌ఎం ఫారూఖ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

చిలమత్తూరు: మైనార్టీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన ఎస్‌ఎం ఫారూఖ్‌ను హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలకుంట నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో బాబావలి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, వార్డు ఇన్‌చార్జులు అయూబ్ బైగ్, ఆసిఫ్‌ఖాన్, డిష్ చాంద్, అంబేడ్కర్ నవీన్, నాయకులు జంగం చందు, సల్మాన్, షేక్ బాబాజాన్, మహబూబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: నిబంధనలు ఉల్లంఘించి సెలవురోజుల్లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి కోరారు. మంగళవారం పట్టణంలోని బీసీ హాస్టల్ వద్ద సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు విద్యాసంస్థలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా నాయకులు భగత్, నాగేంద్ర, పట్టణ నాయకులు మహేష్, సురేష్, రాజు, నందీష్, సుభాష్, మంజునాథ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పగడ్బందీగా 'ఓటరు నమోదు'




మాట్లాడుతున్న డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి

మడకశిర: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పగడ్బందీగా చేపట్టాలని డీఆర్‌ఓ, మడకశిర స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణరెడ్డి కోరారు. ఓటరు నమోదుపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో బూత్ స్థాయి అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి కొత్తగా ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 18సంవత్సరాలు నిండిన యువతి, యువకుల ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల మార్పుల కోసం దరఖాస్తులు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి రామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఓటరుగా నమోదు చేసుకోండి'

రొళ్ల: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మంగళవారం తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో పూర్తిగా లేని వారు, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే మార్పులు, చేర్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేంద్రియ ఉత్పత్తుల పరిశీలన



పులేరు గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

గోరంట్ల: పులేరు గ్రామంలో సేంద్రియ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ జిల్లా ఎవాల్యుయేటర్ వెంకటేశు ఏఓ శంకరనాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులు, పురుగు మందులు మాత్రమే వాడాలన్నారు. మొక్కజొన్న దిగుబడిని పరీక్షల నిమిత్తం సేకరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏఈఓ లోకేష్, క్యూయం ఎస్ శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఉడుముల జయరాములును మంగళవారం ఇంటి ఎదురుగా ఉన్న పులిచెర్ల రామాంజనేయులు కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇంటి ముందు ఎప్పుడు చూసినా రామాంజనేయులు వీధిలో అందరితో గొడవపడేవాడు. ఈక్రమంలో జయరాములుతో గొడవపడిన రామాంజనేయులు కట్టెతో అతని తలపై దాడి చేసి గాయపరిచాడు.



మడకశిరలో గాయత్రీదేవిగా వడిశలమ్మ



మడకశిరలో బాల త్రిపురసుందరీదేవి



మడకశిరలో బాల త్రిపురసుందరీదేవిగా చంద్రమౌళేశ్వరస్వామి



మడకశిరరూరల్: లక్ష్మీనిడి మామిడమ్మదేవి



గుడిబండ: ధనలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



రొళ్ల మండలం రత్నగిరి కోటలో కామటేశ్వర కాళికాంబదేవి



అమరాపురం చోళమాంబదేవి



పావగడలో నిమ్మకాయల అలంకరణలో కాళికాదేవి

లోకమాతా.. నమోనమామి

హిందూపురం: హిందూపురంలో శరన్నవరాత్రి సందర్భంగా పలు అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు, సామూహిక అర్చనలు చేశారు. వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో మహిళామండలి ఆధ్వర్యంలో కోల్హాపురి మహాలక్ష్మిదేవి ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం చేశారు. వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో మూడు కిలోల సువర్ణ వాసవీమాత చర విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం, మహిళా కుసుమపుత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో అర్చనలు చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల శోభ

మడకశిర నెట్‌వర్క్: మడకశిర నియోజకవర్గవ్యాప్తంగా మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల్లో దశరా శవన్నరాత్రి ఉత్సవాలు మంగళవారం కొనసాగాయి. అర్చకులు ఆలయాల్లో అమ్మ వార్లను ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపారు.అలాగే ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

గాయత్రీదేవి అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించకుని లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో వెలిసిన దుర్గాదేవి అమ్మవారిని మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహా మంగళారతి తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు.


చిలమత్తూరు: దేవీ నవరాత్రుల్లో భాగంగా మండలంలోని దేమకేతేపల్లిలో వెలసిన చౌడేశ్వరీదేవి మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



హిందూపురం: వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో బంగారు చర విగ్రహానికి అన్న కుటోత్సవం చేసిన దృశ్యం



చంద్రగిరి గ్రామంలో గాయత్రి దేవిగా మహేశ్వరి అమ్మవారు



పరిగిలో గాయత్రీదేవి అలంకరణలో సప్తమాత్రుక అమ్మవారు



పెనుకొండ: తమలపాకు అలంకరణలో వాసవీమాత



గోరంట్ల: మంగళగౌరిగా దర్శనమిస్తున్న చౌడేశ్వరి మాత



మడకశిరరూరల్: గాయిత్రిదేవిగా వీరకేతమ్మ అమ్మవారు



గాయిత్రీదేవి అలంకరణలో కొలువైన దుర్గాదేవి



సోమందేపల్లిలో పార్వతి దేవిగా అంబ భవానీ అమ్మవారు



గాయత్రీదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి

రెవెన్యూ సదస్సులో వెల్లువలా వినతులు

చిలమత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి సుమారు 250 వినతులు అందాయి. రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడం, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేష్ నిర్లక్ష్యంగా ఉంటూ కార్యాలయం వైపే చూడకపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శల నేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పార్టీకి చెడ్డపేరు వస్తుందని భావించి పీఏ వీరయ్య ద్వారా రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయించారు. ఒక్కరోజు ప్రచారంతోనే రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు.



ఎంపీడీఓ కార్యాలయంలో తలుపులు మూసి కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి: రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేష్ కార్యాలయానికే రావడం లేదని, ఇలాగైతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని పీఏకు కూటమి నేతలు పీఏ వీరయ్యకు ఫిర్యాదు చేశారు. గతంలోనే ఫిర్యాదులున్నా వెంకటేష్‌కు మళ్లీ బాధ్యతలు ఎందుకు ఇచ్చారో అర్థం కాని పరిస్థితి అని కూటమి నేతలే చర్చించుకున్నారు. రెగ్యులర్‌గా కార్యాలయాలకు వచ్చే వారికి తహసీల్దార్ పదవులు ఇవ్వాలని, అసలు కార్యాలయానికే రాని వ్యక్తికి ఎలా కట్టబెడతారంటూ పీఏ ఎదుట వాపోయినట్టుగా తెలిసింది.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గుడిబండ: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారులు శివానంద్, వెంగళరావ్, వెంకటరమణ సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం మహిళలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శివానంద్

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రంలో కల్లుమర్రి పాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం స్వస్త్ నారీ సశ్కక్తి పరివార్ కార్యక్రమం కింద వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వినోద్ కుమార్, లిఖిత మహిళలకు వైద్య చికిత్సలు, పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్, సరస్వతమ్మ, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

పెనుకొండ: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న గుంటూరులో తలపెట్టిన రణభేరి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం యూటీఎఫ్ నాయకులు చలో గుంటూరు పోస్టర్‌ను పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. పీఆర్‌సీ కమిషనను నియమించాలని అంతవరకూ 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు రమేష్, రవీంద్రనాథ్, గంగాధర్, ఆదిజినేష్, రామాంజనేయులు, గోవిందప్ప, నరసింహులు, వరప్రసాద్, వెంకటానాయక్, క్రిష్టప్ప, పోతన్న తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రభుత్వ భూములను కాపాడండి

మడకశిర: మండలంలోని గొడనహళ్లి పంచాయతీలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని మంగళవారం మడకశిరకు వచ్చిన డీఆర్‌ఓ సుర్యనారాయణరెడ్డికి సీపీఎం నాయకులు వినతి పత్రం అందించారు. చెరువులు, కుంటలు, బావులు, వంక, గ్రామ కంఠం భూములు కూడా కబ్జాకు గురయ్యాయని డీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. భూకబ్జాదారులు అక్రమంగా ఖాతాల్లోకి ఎక్కించుకున్న ప్రభుత్వ భూములపై రూ.లక్షల్లో బ్యాంక్‌లో రుణాలు తీసుకొన్నారన్నారు. వెంటనే డీసీలాండ్స్, చెరువు, వాగులు, గ్రామ కంఠం భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఎం నాయకులు ఈరేష్, షాహిద్, మహీంద్రా, గణేష్ తదితరులు ఉన్నారు.



డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లేఅవుట్‌లో రాళ్ల తొలగింపు

పెనుకొండ: పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన 2 ఎకరాల్లో అనధికారికంగా వేసిన లేఅవుట్‌ల రాళ్లను మంగళవారం తొలగించినట్లు నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారని అయితే అహుడా అనుమతులతో పాటు నగర పంచాయితీ అనమతులు తప్పని సరి కావడంతో లేఅవుట్ రాళ్లను తొలగించినట్లు పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

అమరాపురం: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మడకశిర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచిచంఆరు. మంగళవారం అమరాపురానికి వచ్చిన ఆయన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్‌తో కలసి ఆయన పార్టీ వివిధ అనుబంధ సంఘం అధ్యక్షులు, సభ్యులు ఎంపీటీసీలు, సర్పంచులతో కలసి మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. అదేవిధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ నేత జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, సెల్ నియోజకవర్గ అధ్యక్షులు శివకుమార్, శివన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, నాయకులు రంజిత్‌కుమార్, రామమూర్తి, గంగప్ప, రంగనాథ, నంజుండప్ప, ప్రసాద్, నారాయణ, తిప్పయ్య, యంజేరప్ప, నభీరసూల్, వెంకటరమణ, ఇషాక్, ధనుంజయ, సదానందగౌడ, ఎంపీటీసీలు హనుమంతరాయ, నారాయణగౌడ, మైలారప్ప, సర్పంచులు గోవిందరాయ, గిరిజమ్మ పాల్గొన్నారు.



అమరాపురంలో మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యత

రొళ్ల: వైఎస్సార్‌సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మంగళవారం సాయంత్రం రొళ్ల పట్టణంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో పార్టీ బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పేదల పక్షాన నిలబడి ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు అందేలా పోరాడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్న ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదన్నారు. పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో సైనికుల్లా పని చేసి 2029 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల కార్యవర్గం ఏర్పాటు



కార్యవర్గ సభ్యులను తీర్మానం చేస్తున్న ఉద్యోగులు

అగళి: మండల గ్రామ సచివాలయ ఉద్యోగులు కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సచివాలంలో ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఎస్.రాజునాయక్,ఉ పాధ్యక్షుడిగా ఆనంద బాబు, ట్రెజరీగా లిఖితకుమార్, ఆర్గనైజర్‌గా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రొద్దం ఎంపీడీఓగా ఆనంద్‌ప్రసాద్

రొద్దం: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నూతన ఎంపీడీఓగా ఆనంద్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాప్తాడులో డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శు లు, సచివాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ తెలిపారు.

నేరాలు జరగకుండా చూడాలి



పోలీసులతో సమీక్షిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

మడకశిర: నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప సూచించారు. మంగళవారం రాత్రి ఆయన సీఐలు, ఎస్‌ఐలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కేసులపై సమీక్షించారు. మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, టౌన్ సీఐ నగేష్ సమావేశంలో పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐదు మండలాల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యనందించండి

అమరాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలకు ఆట పాటలతో విద్యనందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ సూచిచంఆరు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అమరాపురం సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆడుతూ పాడుతూ విద్యను నేర్పించాలన్నారు.

పాఠశాలకు డ్రమ్ సెట్ పంపిణీ

పావగడ: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ పాళ్య గ్రామంలోని నిడగల్ గ్రామీణ పాఠశాలకు డ్రమ్ సెట్ పరికరాలను క్లబ్ పదాధికారులు మంగళవారం అందించారు. రోటరీ అధ్యక్షుడు వి.రామాంజి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, క్లబ్ కార్యదర్శి కొత్తూరు ప్రభాకర్, కమల్ బాబు, కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రమ్ సెట్ అందిస్తున్న దృశ్యం

రైల్వే రక్షణ కోసమే ఆర్‌పీఎఫ్ ఆవిర్భావం

ధర్మవరం: రైల్వే రక్షణ కోసమే ఆర్‌పీఎఫ్ ఆవిర్భవించిందని ఆర్‌పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైల్వేశాఖపై ఎవరు దాడులు చేయరాదని చేసిన వారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు. రైల్వేలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రయాణికులు సైతం రైళ్లలో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు ఆపాలి



ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం వేధింపులు ఆపాలని, లేకపోతే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపితే తప్పా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తే సోషల్ మీడియాలో ఎవరూ ప్రశ్నించరన్నారు. హామీలు అమలు చేయకుండా.. వైఫల్యాలను ఎత్తి చూపకూడదని కూటమి నాయకులు అనడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికీ ప్రభుత్వ వైఫల్యాలు, తప్పులను ప్రశ్నించే హక్కు ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నిస్తున్నారని, ఎక్కడా అసభ్యకరమైన పోస్టులు పెట్టి ఇబ్బందులు పెట్టడం లేదన్నారు. కూటమి కార్యకర్తలే తమ పార్టీ నాయకులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టి గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి నాయకులు అనవసరంగా తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు.

బీఎస్పీ నాయకుల దళిత రణభేరి



హిందూపురం రైల్వేస్టేషన్ నుంచి విజయవాడకు బయల్దేరుతున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం: హిందూపురం బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో చలో విజయవాడ- ధర్నా చౌక్ దళిత రణభేరికి మంగళవారం బయల్దేరారు. కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్స్ అత్తర్ సింగ్, సురేష్ ఆర్య, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతం కుమార్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో ప్రభుత్వానికి హింస పాలనను నిలదీయనున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనునిత్యం దళితులపై దాడులు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మూర్తి, పెద్దన్న, రామాంజనప్ప, తిరుమలేష్, చంద్రశేఖర్, రాజా, తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.